జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
## కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల -పెద్దపల్లి
గురువారం | 26 | ఫిబ్రవరి | 2026 | పేజీలు: 13



ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు




## స్వచ్ఛ్ సర్వేక్షన్‌లో
# మెరుగైన ర్యాంకే లక్ష్యం

6



## ఏసీబీ తనిఖీలలో చిక్కిన పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి సస్పెన్షన్

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి): ఏసీబీ తనిఖీల్లో చిక్కిన పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కే.అలివేణి ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో జరుగుతున్న అవకతవకల గురించి సమాచారం అందుకున్న ఏసీబీ శాఖ ఫిబ్రవరి 24న ఆకస్మిక తనిఖీలు నిర్వహించిందని, ఆ తనీఖీలలో పట్టుబడిన పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కే. అలీవేణి ను సస్పెండ్ చేస్తున్నామని, మండల వ్యవసాయ అధికారి పై క్రమశిక్షణ చర్యలు విచారణ ముగిసే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని, సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని ఆ ఉత్తర్వులలో కలెక్టర్ పేర్కొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు
# ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):

గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు కట్టుదిట్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై ఇ.వై టీం నిశాంత్ సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి కు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రాంరెడ్డి ,ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ,డి. పి.ఓ. వీర బుచయ్య,గోదావరిఖని ఏ.సి. పి.రమేష్,ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# నిరుపేద మహిళకు సొంతింటి కల సాకారం

## ఎన్నారై ఉదారత



**బీర్ పూర్, ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి):** మానవత్వం ఇంకా మరణించలేదని నిరూపించారు ఓ ప్రవాస భారతీయుడు. భర్తను కోల్పోయి, ముగ్గురు కూతుళ్లతో పూరి గుడిసెలో కాలం వెళ్లదీస్తున్న ఓ నిరుపేద మహిళ దీనస్థితిని చూసి చలించిపోయిన ఆయన, ఆమెకు పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. బీర్ పూర్ మండల కేంద్రంలోని నాయకపు గూడెంకు చెందిన సీపెల్లి జమున భర్త అనారోగ్యంతో మరణించారు. అప్పటి నుండి ఆమె తన ముగ్గురు కుమార్తెలతో కలిసి శిథిలావస్థకు చేరిన పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారు. వీరి కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకున్న ఆస్ట్రేలియాలో స్థిరపడిన జగిత్యాల వాసి కోటగిరి రంజిత్, వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.

### ప్రారంభమైన నిర్మాణ పనులు:

రంజిత్ అందించిన ఆర్థిక సాయంతో, బుధవారం నూతన గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్థానికులతో కలిసి నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. వేల మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ, తన సొంత గడ్డపై ఉన్న నిరుపేద కుటుంబం గురించి ఆలోచించి ఆర్థిక సాయం చేసిన రంజిత్ ఉదారత అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్, ఉప సర్పంచ్ ఎనగంటి జితేందర్, సామాజిక సేవకుడు సామ ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు ప్రసాద్, మల్లేష్, స్థానిక నాయకులు శ్రీనివాస్, సామాజిక కార్యకర్త ఆడేపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. సొంతింటి నిర్మాణం ప్రారంభం కావడంతో జమున కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, సాయం చేసిన రంజిత్‌కు, సహకరించిన రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత




**భీమరం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):** భీమారం మండలం రంగాపూర్ ప్రాజెక్టు నుంచి అక్రమంగా ఇసుకను తవ్వి మూడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం గమనించిన భీమారం గ్రామస్తులు ట్రాక్టర్లను అడ్డుకుని వెంటనే ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని సురక్షిత కస్టడీలోకి తీసుకుని స్థానిక మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ, రంగాపూర్ ప్రాజెక్టు పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టి తరలిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ తవ్వకాలపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగుతుందని తెలిపారు.

# రికార్డుల తనిఖీ చేసిన డిఎల్‌పిఒ



**రాయికల్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):** రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్యం రికార్డుల తనిఖీ నిర్వహించిన డిఎల్‌పిఒ విమల ఈ సందర్భంగా డిఎల్పిఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది వారి విధులను సక్రమంగా నిర్వహించి గ్రామపంచాయతీని ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని సూచించారు సిబ్బందికి సబ్బులు,నూనెలు, బెల్లం వస్తువులు అందజేశారు అనంతరం గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్ ను సాల్వతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుష్మ పంచాయతీ సెక్రెటరీ లైసెట్టి శేఖర్ ఉన్నారు.

# మృతురాలి కుటుంబానికి 2 లక్షల బీమా చెక్కు పంపిణీ



**బీర్ పూర్, ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి):** అనారోగ్యంతో మరణించిన బీర్ పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన పెదగొండ అంజవ్వ (47) కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనకింద ఆర్థిక భరోసా లభించింది. అంజవ్వ గత కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మరణించగా, ఆమెకు బీర్ పూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో బీమా సౌకర్యం ఉంది. సారంగాపూర్ సి.ఎఫ్.ఎల్ కౌన్సిలర్లు మరియు బ్యాంక్ మేనేజర్ విక్రమ్ ప్రత్యేక చొరవతో మంజూరైన 2,00,000/- విలువైన చెక్కును బుధవారం నామినీ అయిన పవన్ కళ్యాణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ విక్రమ్ మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు ఆపద కాలంలో ప్రభుత్వ బీమా పథకాలు కొండంత అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం కౌన్సిలర్ సౌజన్య, గ్రామ సర్పంచ్ మరియు కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయ్ కుమార్, వనజ, మంగేళ గ్రామ ఉపసర్పంచ్, సీఏ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతూ యువతి ఆత్మహత్య

**కొడిమ్యాల, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):** అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఓయువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పాయపల్లి గ్రామానికి చెందిన గడ్డం అర్చన (25) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది.ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి యువతి మరణించడం జరిగిందని, మృతురాలి తల్లి మునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# ఎస్సారెస్పీ కెనాల్ లో గుర్తు తెలియని శవం లభ్యం

**చొప్పదండి, ఫిబ్రవరి 26 ( ప్రజాజ్యోతి):** చొప్పదండి మండలం పెద్దకురుమపల్లి గ్రామ శివారు ప్రాంతంలో గల జంగముని కుంట ప్రక్కన ఎస్సారెస్పీ కెనాల్ లో బుధవారం గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభ్యమైందని ఎస్సై నరేష్ రెడ్డి తెలిపారు.వయసు సుమారు 40-50 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5 అడుగుల 6 అంగుళాలు, డెడ్ బాడీ గుర్తు తెలియని విధంగా ఉబ్బి ఉందని పేర్కొన్నారు. తలపై



తెల్ల వెంట్రుకలు, ఒంటిపై గ్రీన్ కలర్ గీతలు గల షర్ట్ ఒకటి,ఎరుపు రంగు టీ షర్ట్ మరొకటి, లైట్ క్రీం కలర్ టీ షర్ట్ తో మూడు షర్టులు, అలాగే మూడు పాంట్ లు ధరించి వున్నాడని తెలిపారు. నడుముకు వివిధ రకాల తాడులు ధరించి ఉన్నాడని,తన వేషధారణ బట్టి మతిస్థిమితం లేకుండా ఉన్నట్లు అనుమానం ఉందని చెప్పారు. గ్రామ పాలనా అధికారి రమేష్ దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. డెడ్ బాడీ వివరాలు తెలిసిన వారు ఎన్. నరేష్ రెడ్డి (ఎస్ఐ) సెల్: 8712670766, వేణు (హెచ్.సి)సెల్: 9440501014 లను సంప్రదించాలని కోరారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

## శ్రీ సత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో 234 మందికి ఉచిత వైద్య పరీక్షలు వేల రూపాయల విలువైన పరీక్షలు ఉచితంగా నిర్వహణ





**రాయికల్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):** ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అనే సంకల్పంతో శ్రీ సత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఆరోగ్య సమస్యలను పరీక్షించించుకోవడంతో శిబిరం విజయవంతంగా కొనసాగింది.ఈ శిబిరాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఉదయ్ కుమార్ (ఎం.డి), డాక్టర్ సిహెచ్ శ్వేత (క్రిటికల్ కేర్) ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు, పురుషులు కలిపి మొత్తం 234 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య స్థితిగతులను సమగ్రంగా పరిశీలించారు. ప్రతి ఒక్కరికి సాధారణంగా రూ.3000 వరకు ఖర్చు అయ్యే ఎముకల బలపరీక్ష, విటమిన్ డి3 పరీక్ష, ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. ఆధునిక పరికరాలతో చేసిన ఈ పరీక్షల ద్వారా రోగులలో ఉన్న ఆరోగ్య సమస్యలను గుర్తించి, వెంటనే తగిన సూచనలు అందజేశారు.పరీక్షల రిపోర్టుల ఆధారంగా వైద్యులు రోగులకు పాటించవలసిన ఆహార నియమాలు, జీవన శైలి మార్పులు, వ్యాయామ సూచనలు వివరించారు. అలాగే వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన ఉచిత మందులను కూడా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సమగ్ర వైద్య సేవలు అరుదుగా లభిస్తాయని, ఈ శిబిరం ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా నిలిచిందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. శిబిరం నిర్వహణలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ యువకులు చురుకుగా సహకరించారు. వారి సమన్వయంతో గ్రామ ప్రజలకు ముందస్తు సమాచారం చేరవేయడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి హాజరయ్యారు. కార్యక్రమం సాఫల్యంపై నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో శ్రీ సత్య హాస్పిటల్ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు. ఈ శిబిరం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే కాకుండా, వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఇది ఒక మంచి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి మోహన్, ఉప సర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ జకిలేటి హరీష్ రావు,వార్డు నెంబర్ అయిండ్లని భరత్ రెడ్డి, గోనె విష్ణు, కోల రాజు, చల్ల శివ, దుగ్యాల రాంపతిరావు, సంతోష్ రావు,, సూర విజయ్, అంబల్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్ష రాజ్యమేలడం సిగ్గుచేటు

### డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్
### మాణిక్యారం ఘటనపై సమతా సైనిక దళ్ ఆగ్రహం
### బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి




**ఎన్టిపిసి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మాణిక్యారం గ్రామంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావుపై జరిగిన కుల వివక్ష, సామాజిక బహిష్కరణ ఉదంతాన్ని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో, అదీ ఉన్నత పదవులు నిర్వహించిన ఒక దళిత నాయకుడికే రక్షణ లేకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాలయ నిర్మాణం పేరుతో ఎస్సీ, ఎస్టీ వర్గాలను దూరం పెట్టడం, వారిని అవమానించడం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. జనగం కోటేశ్వరరావు వంటి సీనియర్ నాయకుడిని సామాజికంగా వెలివేయాలని నిర్ణయించడం అగ్రవర్ణ అహంకారానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. "జిల్లా స్థాయి నాయకుడి పరిస్థితే ఇలా ఉంటే, ఇక సామాన్య దళితుల పరిస్థితి ఏమిటి?" అని ఆయన ప్రశ్నించారు. గ్రామంలో కుల పిచ్చిని ప్రోత్సహిస్తూ, వర్గాల మధ్య చిచ్చు పెడుతున్న వారిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠినమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులెవరైనా సరే వదిలిపెట్టకూడదని, అణగారిన వర్గాలకు అండగా సమతా సైనిక దళ్ పోరాడుతుందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కలిసిమెలిసి ఉంటున్న గ్రామంలో ఇలాంటి విద్వేష పూరిత చర్యలకు పాల్పడటం బాధాకరమని, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బాధితుడు కోటేశ్వరరావుకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ హెచ్చరించారు.

# బిఎంఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా




**కరీంనగర్ కలెక్టరేట్ ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి)**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భారతీయ మజ్దూర్ సంఘ్ బిఎంఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్ గారి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. కార్మిక చట్టాల అమలులో నిర్లక్ష్యం,కనీస వేతనాల పెంపు లేకపోవడం,కార్మికుల సామాజిక భద్రతా హక్కుల పరిరక్షణలో లోపాలు వంటి అంశాలపై ఈ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, బీడీ కార్మికుల హక్కులు కాపాడాలని,బీడీ కార్మికుల వేతనాలు పెంచాలని,అన్ని రంగాల్లో కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని,ఆశ,అంగన్వాడీ కార్యకర్తల ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాల పెంపు మరియు భద్రతా పథకాలను బలోపేతం చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్మికులే దేశ ఆర్థిక వ్యవస్థకు మూలం.కానీ ప్రభుత్వాలు పట్టించుకున్న పరిస్థితుల్లో లేవు, 95 పెన్షనర్లకు రూ 7500 లకు పెంచాలి, ఇపిఎఫ్ఓ కనీస వేతన పరిమితిని పెంచాలి, కరీంనగర్లో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. బీడీ కార్మికులు,రైస్ మిల్ కార్మికులు,స్ట్రీట్ వెండర్స్ బిఎంఎస్ కార్యకర్తలు,బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రేణికుంట శంకర్, నక్క అరుణ్,ఆకుల తిరుపతి,మధుకర్, రాజేశం,సుమతి, స్వప్న,అనసూర్య,లక్ష్మీ,అనిత పాల్గొన్నారు.

# మండేపల్లిలో గొల్ల కురుమ సంఘం అడిషనల్ బిల్డింగ్ పనులు ప్రారంభం

**తంగళ్ళపల్లి ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి)**

తంగళ్ళపల్లి మండలంహామండేపల్లి గ్రామంలో యాదవ సంఘం అడిషనల్ బిల్డింగ్ 5 లక్షల రూపాయలతోహనిర్మించుటకు పనులను ప్రారంభంచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గదగొని సాగర్, ఎఎంసి వైస్ చైర్మన్ నేరళ్ల నరసింగం గౌడ్, ఉపసర్పంచ్ యాస సందీప్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్,మహిళా మండలం అధ్యక్షురాలు ధర్మారెడ్డి హారిక రెడ్డి,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అసాని మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి లింగాల భూపతి, మూర్తి మహిపాల్ రెడ్డి, అండెం చంద్రారెడ్డి,వార్డ్ సభ్యులు బోడపట్ల రాకేష్,బండి రేణుక,యాదవ సంఘం అధ్యక్షులు కాసాని శ్రీనివాస్,ఉపాధ్యక్షులు గుంటి శ్రీనువాస్, ప్రధాన కార్యదర్శి బండిచెన్న రమేష్,క్యాషియర్ ఒగ్గు మల్లేశం, సలహాదరు బండి శ్రీకాంత్,ఒగ్గు కనుకయ్య అమరగొండ ప్రభుదాస్,జగ్గాని మల్లేశం,మాజీ అధ్యక్షులు అమరగొండ మొండయ్య,ఏనుగుల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మార్కెట్ చైర్మన్

**చొప్పదండి, ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి):**



ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా చొప్పదండి మండలానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివిన పాఠ్యాంశాలను ఇష్టంతో, ధైర్యంగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఈ పరీక్షలు పునాది వంటివని, అందువల్ల సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని తెలిపారు.మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని, వారి కలలను నిజం చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, ఏకాగ్రతతో పరీక్షలు రాసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు.

# ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్‌గా కొలిపాక శ్రీనివాస్

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి
### పార్టీ బలోపేతమే లక్ష్యమని వెల్లడి

**పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**



ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా కొలిపాక శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే లక్ష్యంతో ఈ నియామకం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. తక్షణమే అమల్లోకి వచ్చే ఈ బాధ్యతల ద్వారా జిల్లాలోని మండల, పట్టణ, గ్రామ స్థాయి కమిటీలను సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని శ్రీనివాస్‌కు సూచించారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సభ్యత్వ నమోదుతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని జోజి రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై స్పందిస్తూ బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారు. తన నియామకంపై కొలిపాక శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను పార్టీ వైపు ఆకర్షించేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. శ్రీనివాస్ నాయకత్వంలో పెద్దపల్లి జిల్లాలో ఏఐఎఫ్‌బీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# చెరువులు, కుంటలు, కాలువలపై అక్రమ నిర్మాణాలు

### అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల్లో ఆందోళన

**ముస్తాబాద్, ఫిబ్రవరి 25 ( ప్రజా జ్యోతి ):**



మండల పరిధిలో చెరువులు, కుంటలు, కాలువలకు సంబంధించిన ప్రభుత్వ జలవనరుల భూములపై అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన భూములను కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత ఇరిగేషన్ డి.ఈ.ను వివరణ కోరగా, "హద్దులు చూపించడం మా బాధ్యత మాత్రమే. ఆ హద్దులలో ఎవరైనా నిర్మాణాలు చేపడితే అవి అక్రమాలు. వాటిని తొలగించే బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శిదే" అని తెలిపారు. అదే అంశంపై గ్రామసభలో పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించగా, "ఇది ఇరిగేషన్ శాఖకు సంబంధించిన విషయం" అంటూ సమాధానం ఇవ్వడంతో ప్రజలు మరింత గందరగోళానికి గురయ్యారు. ఒక శాఖ మరొక శాఖపై బాధ్యత నెట్టివేయడంతో అక్రమ నిర్మాణాలపై ఎవరిని ప్రశ్నించాలి అన్న సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు. ఇదిలా ఉండగా, ఈ అక్రమ నిర్మాణాలకు గ్రామపంచాయతీ నూతన సర్పంచ్, పాలకవర్గం అండదండలు ఉన్నాయనే చర్చలు గ్రామంలో వినిపిస్తున్నాయి. అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో ప్రభుత్వ భూములు క్రమంగా ఆక్రమణకు గురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ స్థల పరిశీలన నిర్వహించి, నిర్మాణాలు ఎవరికి చెందినవో గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# వృద్ధులు, మహిళలకు త్వరలోనే శుభవార్త

**వేములవాడ, ఫిబ్రవరి, 25:ప్రజాజ్యోతి.**

తెలంగాణ ప్రభుత్వం, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుపరిచేందుకు దృష్టిసారించింది, కొత్తపథకం లు, వృధాప్య పెన్షషన్ 4000 రూపాయలు, పెన్షషన్లేని మహిళాలకు, 2500రూపాయలు, విద్యార్థుల కు ఉచితల్యాప్టాప్, పథకంలకు నిధులు అందుబాటు పైన ఆర్థిక శాఖ, ఇప్పటికే ముఖ్యమంత్రికు నివేదించింది. వచ్చేవార్షిక ఆర్థికబడ్జెట్లో, వీటినిప్రకటించానున్నట్లు సమాచారం.వివిధ శాఖలు అందించే ప్రతిపాదనలు పైన మంత్రి వర్గం, నిర్ణయం తిచుకొన్నున్నట్లు సమాచారం?.



## నేటి నుండి ఇటిక్యాలలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు




**రాయికల్, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి)**

రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిపించుటకు ధర్మకర్తలు శ్రీ చెన్నమనేని విష్ణువర్ధన్, వంశీవర్ధన్ సారధ్యంలో ఏర్పాట్లు పూర్తయినట్లు అర్చకులు మరింగంటి రామకృష్ణాచార్యులు తెలిపారు.. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ 26 వ తేదీ నుండి మార్చి 05 వ తేది వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆయన అన్నారు..28 వ తేదీ శనివారం రోజున శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం, మహా అన్నదానం, మార్చి 4 బుధవారం రోజున స్వామివారి రథోత్సవం, జాతర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు తెలిపారు..

## కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పూస్తే మట్టెలు అందజేత



**తంగళ్ళపల్లి ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి)**

తంగళ్ళపల్లి మండలం నర్సింహులపల్లే గ్రామంలో పాడిరైతు కొండెటి యాదిరెడ్డి,యాదలక్ష్మీల కూతురు వెన్నెల వివాహానికి కరీంనగర్ డెయిరీ పుస్తెమట్టెలు అందజేసిన చిన్నలింగాపూర్ రూట్ సూపర్వైజర్ గుర్రం సతీష్ రెడ్డి. ఈసందర్భంగా గుర్రం సతీష్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చెపట్టిందని అందులో భాగంగా కళ్యాణమస్తు పథకంలో భాగంగా ఆడబిడ్డ పెళ్లికి పుస్తెమట్టెలు అందజేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో నర్సింహులపల్లే పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షులు మంద దేవయ్య,డైరెక్టర్లు కొండెటి రాములు,పల్లె నర్సయ్య,సెక్రటరీ గొడిసెల బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం

**తంగళ్ళపల్లి ఫిబ్రవరి 25(ప్రజా జ్యోతి)**

రామచంద్రపురం గ్రామంలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ గంధం శ్రీనివాస్, ఉపసర్పంచ్ పొన్నాల నర్సింలు, వార్డు మెంబర్లు గడ్డం లహరి,గంధం లక్ష్మి, గంధం రమేష్,శేఖర్,పొన్నాల అమృత,గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి,బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నాల చక్రపాణి,ఫీల్డ్ అసిస్టెంట్ పూర్ణచందర్ మరియు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి )**

స్థానిక నగరంలోని మంకమ్మ తోట గర్ల్స్ హైస్కూల్ పాఠశాల యందు ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా పలకలు పెన్నులు అందించారు . ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.ప్రమిల మాట్లాడుతూ ఆదరణ సేవా సమితి వారు నిర్వహిస్తున్న పర్యావరణం పరిరక్షణ, ప్రభుత్వ పాఠశాలలో వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. సమాజంలో ఆదరణ సేవా సమితి తన వంతు పాత్ర పోషిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు కర్రె పావని రవి మాట్లాడుతూ ఆదరణ సేవా సమితి ద్వారా ప్రతి సంవత్సరం అనేకమంది ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్షా పలకలు పెన్నులు అందించడం అదేవిధంగా పాఠశాల ప్రారంభ సమయంలో నోటుబుక్కులు స్కూల్ బ్యాగ్ లో అందించడం చేస్తున్నాము ఇంకా ముందు తన వంతు ఎలాంటి సహకారాలైనా సమాజానికి అందించడానికి ముందుగా ఉంటాము. అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కర్రె లాస్య, బీర్ల అనిల్ ఉపాధ్యాయురాలు రాధిక తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ అధ్యాపకురాలు అశ్వినికి డాక్టరేట్

**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి )**



మానవ శరీరంలో హైపర్ టెన్షన్ (బిపి) నియంత్రణలో సాధారణ టాబ్లెట్లకు ప్రత్యామ్నాయంగా ఈప్రోనియోసోమ్స్ పద్దతి పై చేసిన పరిశోధనకు గాను శాతవాహన ఫార్మసీ విభాగానికి చెందిన అధ్యాపకురాలు జె. అశ్విని చేసిన పరిశోదనకు అనురాగ్ విశ్వావిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. అనురాగ్ విశ్వవిద్యాలయ ఫార్మాసీ విభాగములో డీన్ డాక్టర్ వసుధా భక్షి పర్యవేక్షణలో "ఫార్ములేషన్ డెవలప్మెంట్, ఆప్టిమైజేషన్ అండ్ ఇవాల్యూయేషన్ ఆఫ్ ప్రోనియోసోమ్స్ ఆఫ్ యాంటి హైపెర్టెన్సివ్ డ్రగ్స్" అంశంపై తన పరిశోధన చేసారు.డాక్టరేట్ సాధించిన జె అశ్విని కరీంనగర్ ఎల్ఎండి సమీపంలోని శాతవాహన ఫార్మసీ కళాశాలలో గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తు, ఫార్మసీ మహిళా విద్యార్థుల వార్డెన్గా కొనసాగుతున్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన విశ్వవిద్యాలయ యాజమాన్యముకు ఆధ్యాపకులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

## 28న యాదవ ప్లీనరీ సమావేశానికి యాదవ సభ్యులు పెద్ద ఎత్తున తరలి రావాలి

**జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు కొక్కు దేవేందర్ యాదవ్**



**గంభీరావుపేట ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి):**

ఫిబ్రవరి 28న హైదరాబాద్లోని తెలుగు విశ్వ విద్యాలయం లో నిర్వహించనున్న దక్షిణ భారత దేశ యాదవ ప్లీనరి సమావేశానికి యాదవులశీత తరలి రావాలని బుధవారం రోజున జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. గంభీరావుపేట మండలం లోని కొత్తపల్లి గ్రామంలో ప్లీనరి కి సంబంధించిన ప్రచార పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ప్లీనరిలో యాదవుల సమస్యలపై చర్చించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. యాదవులు రాజకీయంగా చైతన్య వంతులు కావాలన్నారు. రాజ్యాధికారం లో భాగస్వాములు కావలన్నారు. 18శాతం జనాభా ఉన్న యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలని, జనాభా ప్రాతిపాధికనా చట్ట సభల్లో యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ. 5000కోట్లు కేటాయించాలని, డిమాండ్ చేశారు. ప్లీనరి ని విజయవంతం చేసి యాదవుల ఐక్యత చాటుదామన్నారు. రాష్ట్ర నలుమూలాల నుండి యాదవులు తరలి రావాలని కోరారు.

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



**ఎండపల్లి,ఫిబ్రవరి 25,(ప్రజా జ్యోతి)**

కార్పొరేట్ కు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గుల్లకోట రాష్ట్రంలోని ఆదర్శంగా నిలుస్తుందని, ఉపాధ్యాయ బృందం నిరంతరం కృషితో గ్రామస్తుల సహకారం తల్లిదండ్రుల ప్రోత్సాహం తో పాఠశాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిందని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు,చందూరి రాజిరెడ్డి, గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ పేర్కొన్నారు, జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని గుల్లకోట లో పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఏకరూప దుస్తులను బుధవారం రోజున ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి తో కలిసి పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభించిన (ఎల్కేజీ)లోయర్ కిండర్ గార్టెన్ (యూకేజీ) అప్పర్ కిండర్ గార్టెన్ తరగతులలో చదువు తున్న 56 మంది విద్యార్థులకు అందజేస్తూ గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణ ఆట, పాటలు,విజ్ఞాన విహారయాత్రలు వన మహోత్సవం, జాతీయ పండుగలు ఎంతో చక్కగా నిర్వహిస్తూ,ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్య ఉచితంగా అందించే ప్రభుత్వ విధానాలను అనుసరించి గుల్లకోట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం నిరంతరం శ్రమించి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య ఆరోగ్యకరమైన పుష్టికరమైన మధ్యాహ్న భోజనం అందివ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,రమాదేవి మాలతి ప్రశాంత్,నరేష్ కుమార్ ,కృష్ణారెడ్డి పూర్వ ప్రాథమిక విద్యా శిక్షకురాలు శిరీష తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు .

# హెల్త్ కార్డుల అమలుపై స్పష్టత ఇవ్వాలి

## ఉపాధ్యాయులు, ఉద్యోగుల సందేహాలు నివృత్తి చేయాలి : ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

**పెద్దపల్లి ప్రతినిధి , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు డిజిటల్ హెల్త్ కార్డులు మంజూరు చేసే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నప్పటికీ అమలు విధానాలపై ప్రభుత్వం పూర్తి స్పష్టత ఇవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా ప్రకటన విడుదల చేశారు. క్యాష్‌లెస్ వైద్య చికిత్స విధానంలో అమలు చేయనున్న నిబంధనలు, ఉద్యోగులు ఉపాధ్యాయుల్లో నెలకొన్న సందేహాలను ప్రభుత్వం వెంటనే నివృత్తి చేయాలని కోరారు. ఫిబ్రవరి 23న రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన డిజిటల్ హెల్త్ కార్డుల విధానంపై స్పందించిన ఆయన, విధివిధానాలు



స్పష్టంగా ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. కేజీబీవీ, ఎస్ఎస్ఏ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కూడా హెల్త్ కార్డులు వర్తిస్తాయా అనే అంశంపై క్లారిటీ ఇవ్వాలని సూచించారు. అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందుతుందా, నగదు రహిత ఓపీ సేవలు ఉంటాయా, ఈహెచ్ఎస్ అమలు ఎప్పటి నుంచి ప్రారంభమవుతుందనే విషయాలు వెల్లడించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి 1.5 శాతం కాంట్రిబ్యూషన్ ఎప్పుడు నుంచి వసూలు చేస్తారో ప్రకటించాలని, పీఆర్సీ అమలు చేసిన తర్వాతే ఉపాధ్యాయుల వాటా స్వీకరించాలని అన్నారు. అంతవరకు హెల్త్ స్కీమ్ ఖర్చులను ప్రభుత్వమే భరించాలని సూచించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించడంతో పాటు కేజీబీవీ, ఎస్-ఎస్ఏ, యూఆర్ఎస్ ఉపాధ్యాయుల కాంట్రిబ్యూషన్‌ను కూడా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు డీఎస్సీ2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు సీపీఎస్ స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటిస్తేనే హెల్త్ కార్డుల పథకం సమర్థవంతంగా అమలవుతుందని ఎమ్మెల్సీ కొమురయ్య పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై అసత్య ఆరోపణలు
## కౌన్సిలర్ పోతరబోయిన శ్రీలతపై ఘాటు విమర్శలు



**మంథని, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :**

మంథని మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లను నియమించలేదని లబ్ధిదారులను భయభ్రాంతులకు గురిచేస్తూ అసత్య ఆరోపణలు చేస్తున్న కౌన్సిలర్ పోతరబోయిన శ్రీలత క్రాంతి మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు గుండ రాజు, తీగల సమ్మయ్య, పోలు శివ ఒక ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు. ఆమె ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని వారు స్పష్టం చేశారు. బుధవారం మంథని పట్టణంలోని ఆరో వార్డు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంథని మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డుల్లో ఏ వార్డులో లేనివిధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల వినతి మేరకు 54 ఇందిరమ్మ ఇళ్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించారని తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రతి లబ్ధిదారుడు స్వయంగా ఇల్లు నిర్మించుకునేలా పూర్తి సహకారం అందిస్తామని, ఎవరైనా లబ్ధిదారులను బెదిరింపులకు గురిచేస్తే మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కొంతమంది తమ రాజకీయ లబ్ధి కోసమే అధికార కాంగ్రెస్ పార్టీని, పార్టీ కార్యకర్తలను బదనాం చేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని పోతారవేణి రాజయ్య, అట్టెం వినయ్, కొంతం శ్రీను, మోహన్, నాయని సంతు తీవ్రంగా ఆరోపించారు.

## ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి సీపీ ఉపవాస దీక్షను విరమించి,వారికి పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం,మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ భీంరావు,ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి,రూరల్ ఏసీపీ విజయకుమార్‌తో పాటు ట్రాఫిక్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది, స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు,



## వేములవాడ భీమేశ్వరుని సన్నిధిలో ప్రముఖ యాంకర్ సుమ

**వేములవాడ, ఫిబ్రవరి, 25: ప్రజాజ్యోతి.**

ప్రముఖ యాంకర్ సుమ కనకాల బుధవారం వేములవాడ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె శ్రీ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రసంప్రదాయం ప్రకారం సుమ కోడె మొక్కును సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలుఅందజేసి, వేదమంత్రాలతో ఆశీర్వచనం గావించారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాన్నికప్పిగౌరవించారు. సుమరాకతో ఆలయ పరిసరాల్లో సందడినెలకొంది, అభిమానులు ఆమెను చూసేందుకు ఆసక్తికనబరిచారు.



## ఓడిపోయిన... మాట నెరవేర్చుకున్న అభ్యర్థి

### మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చిన అభ్యర్థి

**హుజురాబాద్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**



మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 21వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన గుర్రం హరిబాబు అనే అభ్యర్థి ఎన్నికల్లో ఓడిపోయిన ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వార్డులో ఏ ఆడబిడ్డ వివాహం జరిగిన 10,116 ఇస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం యంజాల భాగ్య- వాసుల కుమార్తె శ్రావ్యకు బుధవారం వివాహం జరగగా వివాహ వేడుకకు హాజరైన గుర్రం హరిబాబు రూ. 10, 116 అందజేశారు. అంతేకాకుండా ఆడపిల్ల పుడితే కూడా రూ. 10,116 అందజేస్తానని హామీ ఇచ్చారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తారు విందు

**కోనరావుపేట, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

రంజాన్ పర్వదినా పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. బుధవారం కొనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ప్రముఖ ఎన్నారై అంబోజ వెంకటేష్ స్థానిక మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మతాలక తీతంగా ప్రతి పండుగను కలిసికట్టుగా నిర్వహించుకుంటామన్నారు. గ్రామంలో ముస్లింలు, హిందువులు అన్నదమ్ముల కలిసి మెలిసి ఉంటామన్నారు. ముస్లింలు ఉపవాస దీక్షలో ఉండడంతో వారికి ఈ విందును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం హిందువులు, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపారు.



## వివాహా వేడుకల్లో కాంగ్రెస్ యకులు

**ముత్తరం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

మండలంలో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వామికా రెడ్డి -సుమంత్ రెడ్డి వివాహా వేడుకల్లో పాల్గొని నూతన వధూవరుల ను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ పి.ఎస్సీ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు ఓడేడు గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి చంద్రమౌళి గౌడ్ కొలిపాక సమయ్య పాల్గొని ఆశీర్వదించారు.



# అండర్ డ్రైనేజీ పనుల్లో అవినీతి ఆరోపణలు

### ఇంటింటికీ రూ.300 వసూళ్లు రామగుండం 29వ డివిజన్‌లో కాంట్రాక్టర్ దందా?

**రామగుండం , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్‌లో చేపడుతున్న అండర్ డ్రైనేజీ పనులు అవినీతి ఆరోపణలకు కేంద్రబిందువుగా మారాయి. డ్రైనేజీ పనుల పేరుతో ఇంటింటికీ రూ.300 చొప్పున బలవంతపు వసూళ్లు చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు




నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ సిబ్బంది ప్రతి ఇంటి వద్దకు వెళ్లి తప్పనిసరిగా రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు నివాసితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే పనులు చేయబోమని, కనెక్షన్లు ఇవ్వడంలో ఆలస్యం చేస్తామని బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం ఏ మేరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పెరుగుతున్న జీవన వ్యయాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై అదనపు భారం మోపడం అన్యాయమని మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డివిజన్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

# స్వచ్ఛ్ సర్వేక్షన్ లో మెరుగైన ర్యాంకే లక్ష్యం

## మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి ):**

నగర పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ్ సర్వేక్షన్2026లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు సమగ్ర చర్యలు చేపడతామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పారిశుధ్య విభాగం అధికారులతో తొలి సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో నగర పరిశుభ్రత మెరుగుదల, డివిజన్ వారీ కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన, వంద శాతం చెత్త సేకరణ, వ్యర్థాల వర్గీకరణ (సెగ్రిగేషన్), డీఆర్‌సీసీల నిర్వహణ, జీవీపీ పాయింట్ల పర్యవేక్షణ, ట్రేడ్ లైసెన్సుల పూర్తి, పారిశుధ్య యంత్రాల వినియోగం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

### అవినీతిపై కఠిన చర్యలు

పారిశుధ్య విభాగం నిర్వహణపై పత్రికల్లో వస్తున్న కథనాలపై స్పందించిన మేయర్, వాటిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. అధికారులు, సిబ్బంది ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయపాలన పాటిస్తూ ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, కార్మికుల పనులను ఎస్సైలు, జవాన్లు, సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు.

### చెత్త సేకరణ సెగ్రిగేషన్‌కు ప్రాధాన్యం

ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, పొడి చెత్తను డీఆర్‌సీసీలకు, తడి చెత్తను కంపోస్టింగ్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. విలీన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, కొత్త డివిజన్ల ప్రకారం కార్మికులను సర్దుబాటు చేసి పారిశుధ్య పనులు సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. కమర్షియల్ ఏరియాల్లో చెత్త సేకరణలో లోపాలు ఉంటే టెండర్ నిబంధనల ప్రకారం ఏజెన్సీలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

### ట్రేడ్ లైసెన్సుల పూర్తి పన్నుల వసూళ్లు

నగర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్సులను వందశాతం పూర్తి చేసి, పన్నులు వసూలు చేయాలని సూచించారు. డివిజన్ వారీగా కార్పొరేటర్లతో సమావేశమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని చెప్పారు. డ్రైనేజీల శుభ్రత, చెత్త కలెక్షన్ పాయింట్ల పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ స్వచ్ఛ్ సర్వేక్షన్ పోటీకి సంబంధించి కార్యక్రమాలు తక్షణమే ప్రారంభించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. జీవీపీ పాయింట్ల వద్ద చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు ఓపెన్ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రూట్ మ్యాప్ ప్రకారం చెత్త సేకరణ కొనసాగించాలని, డంప్ యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ ప్రక్రియపై పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, ఎంహెచ్ఓ సుమన్, సూపర్‌వైజర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి మృతికి కారణమైన బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలి

## ఎంఆర్ పిఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి



**ఎండపల్లి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

చిన్నారి మృతికి కారణమైన బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలనీ ఉమ్మడి వెల్గటూర్ మండల ఎంఆర్ పిఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి ఒక ప్రకటనలో లో పేర్కొన్నారు నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెరలో జరిగిన ఘటనపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి స్పందిస్తూ,చిన్నారి మృతి అత్యంత బాధాకరమని,ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ,ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ సివిల్ కాంట్రాక్ట్ వర్కల్లు లంచం అడుగుతున్నారు

**రామగుండం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

రామగుండం 29 డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీ లోఅండర్ డ్రైనేజ్ పనులు చేస్తున్నారు డ్రైనేజ్ కుండికి పైపులు పెట్టానికి ఇంటింటికి 300 రూపాయలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు కాంట్రాక్టర్ వర్కల్లు శ్రీను . శివ. పవన్. నరేష్. సూపర్వైజర్లు డబ్బులు ఇస్తేనే పెడతాం ఎవడికి చెప్పుకుంటారో చెప్పుకో అని స్థానిక కాలనీ ప్రజలను బెదిరిస్తున్నారు.



# ప్రణాళిక ప్రకారం రోడ్డు భద్రతా చర్యలు అమలు చేయాలి



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

ప్రణాళిక ప్రకారం రోడ్డు భద్రతా చర్యలు అమలు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పీ ఆర్, పోలీస్, ట్రాన్స్ పోర్ట్, వైద్య, ఎక్సైజ్, విద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ కమిటీ సమీక్ష సమావేశం అదనపు కలెక్టర్ నిర్వహించారు. ముందుగా గతనెలలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సందర్భంగా చర్చించిన అంశాలపై సమీక్ష చేశారు. రవాణా, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పోలీస్ శాఖ సంయుక్తంగా చేసిన సర్వే వివరాలపై ఆరా తీశారు.వివిధ ప్రధాన రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, సోలార్ సిగ్నల్స్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు పైకి అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. పలు జంక్షన్లు, రహదారుల్లో స్పీడ్ గన్స్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న వాటిని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ లలో కచ్చితంగా నో హెల్మెట్ .. నో పెట్రోల్ అమలు చేయాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను, ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలు, బస్సులను తనిఖీ చేయాలని, ఓవర్ లోడ్ తో వెళ్ళే సరుకు వాహనాలపై దృష్టి సారించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, ఈఈ ఆర్ అండ్ బీ నరసింహాచారి, ఈఈ నేషనల్ హై వేస్ సురేష్ రాథోడ్, డీటీఓ లక్ష్మణ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, నేషనల్ హైవే డీఈ అన్నయ్య, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల తనిఖీ

**కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

కరీంనగర్ నగరంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐ.పి.ఎస్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు.పరీక్ష కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘాను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రతి కేంద్రం వద్ద 'స్టాటిక్ ఫోర్స్'ను కేటాయించినట్లు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ తనిఖీలో ఇతర పోలీసు అధికారులు,విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.



# పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి )**

జిల్లాలో నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సంబంధిత జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు వచ్చే నెల (మార్చి) 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు నిర్వహించ నున్నారని తెలిపారు. 7,317 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.పరీక్షా కేంద్రాల వద్ద పరీక్ష జవాబు పత్రాలను ప్రశ్నపత్రాలను తరలించే సమయంలో పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్ష జరుగుతున్నంత సేపు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష సమయం అనుకూలంగా తగినంత బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షలు కొనసాగే సమయంలో సమీప జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. ఆయా పరిధిలో ఉన్న మున్సిపల్ కమిషనర్లు, ఎంపీ డీఓలు పరీక్ష కేంద్రాలను ముందస్తుగా పరిశీలించి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రంలో వసతులను ఏర్పాటు చేయాలని, ఏఎన్ఎం ను అందుబాటులో ఉంచి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రదేశాల్లో వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ చంద్రయ్య, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, డీటీఓ నవీన్ కుమార్, ఆర్టీసీ, పోస్టల్, వైద్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్‌గా నూగిళ్ళ మల్లయ్య బాధ్యతల స్వీకారం

## శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే విజయరమణారావు



**పెద్దపల్లి ప్రతినిధి , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

అందరి సహకారంతో పెద్దపల్లి పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నూతన మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య తెలిపారు. బుధవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సమక్షంలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ చాంబర్‌లో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్‌లు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే విజయరమణారావు శుభాకాంక్షలు తెలియజేస్తూ పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య మాట్లాడుతూ పట్టణ ప్రజలు అందించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు కుటుంబంలో జన్మించి స్థానిక సమస్యలను దగ్గరగా చూసిన వ్యక్తిగా ఈ పదవిని అధికారంగా కాకుండా సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానన్నారు. ఎమ్మెల్యే సహకారంతో పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, తడిపొడి చెత్త నిర్వహణ, రోడ్లు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి, ఆరోగ్యం, విద్యా సౌకర్యాల మెరుగుదల, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. పారదర్శకంగా, పక్షపాతం లేకుండా ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తోటి కౌన్సిలర్లు, అధికారులు, చైర్మన్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నివర్గాల కార్మికులకు సమాన చట్టాలు అమలుచేయాలి

## కలెక్టరేటు ఎదుట బిఎంఎస్ ధర్నా..



**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

అన్ని రంగాల, వర్గాల కార్మికులకు మినహాయింపు లేకుండా కార్మిక చట్టాలను సార్వత్రికంగా అమలు చేయడమే అంత్యోదయ యొక్క నిజమైన స్ఫూర్తి అని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి కంది శ్రీనివాస్ గౌడ్ అన్నారు. భారత ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కార్మిక చట్టాల్లో రెండు చట్టాలను సరిదిద్దాలని కోరుతూ బుధవారం కలెక్టరేటు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, పారిశ్రామిక సంబంధాల చట్టం, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల చట్టంపై కార్మికుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. త్రైపాక్షిక యంత్రాంగం పునరుద్ధరణ, బలోపేతం, భారత కార్మిక సదస్సును వెంటనే ఏర్పాటు చేయాలని, కార్మికుల సంక్షేమం కోసం క్రమం తప్పకుండా, సమర్థవంతంగా పనిచేసేలా వివిధ త్రైపాక్షిక కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈపిఎస్–95 కింద కనీస పెన్షన్‌ను రూ.వెయ్యి నుండి రూ.7వేల 5వందలకు పెంచాలని కోరారు. ఈమేరకు భారత ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర కార్మిక శాఖామంత్రికి వినతులు సమర్పించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ జిల్లా అధ్యక్షులు చంద్రమౌళి, జిల్లా కార్యదర్శి సాయాని సతీష్, ఎన్టిపిసి యూనియన్ అధ్యక్షులు కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి, సింగరేణి యూనియన్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, సింగరేణి యూనియన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, ఆర్ఎఫ్సిఎల్ యూనియన్ ఉపాధ్యక్షులు బంక రాజేష్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**రాయికల్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**



రాయికల్ మండలం పరిధిలోని చెర్ల కొండాపూర్ గ్రామంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెండాల రజిని అనే మహిళ నివాసంలో విద్యుత్ వైర్లకు మంటలు రావడంతో రేకుల కింద నిల్వ ఉంచిన బట్టలు, నిత్యావసర సరుకులు మరియు గృహ వినియోగ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు ఎగసిపడు తున్నట్టు గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అగ్నిని అదుపులోకి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలిపోవడంతో బాధితురాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఇల్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రస్తుతం బస్టాండ్ సమీపంలోని ఖాళీగా ఉన్న వాటర్ ప్లాంట్ వద్ద ఆశ్రయం తీసుకుని జీవనం సాగిస్తున్నట్టు రజిని తెలిపారు. ఇల్లు పునర్నిర్మించుకునే ఆర్థిక స్తోమత తమకు లేదని, ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి, కొత్త ఇల్లు మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామస్థులు కూడా ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి సహాయం చేయాలని కోరుతున్నారు.

# బాలికలకు ప్రత్యేక పరీక్షలు



**రాయికల్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యం లో 115మంది బాలికలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి అనీమియా తో బాధపడుతున్న 73 మంది బాలికలకు నెలకు సరిపడ మందులు మరియు సానిటరి ప్యాడ్స్ పంపిణీ చేశారు. బాలికలకు వారి ఆరోగ్యంను ఎలా కాపాడు కోవాలో, రక్త హీనత ఎలా వస్తుందనే విషయాలను డాక్టర్లు హేమంత్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ అచ్యుత్ మరియు పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సాహితీ చక్కటి సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గుర్రం భావన మహేందర్, మాజీ సర్పంచ్ శ్రీ జక్కుల చంద్రశేఖర్, గ్రామీణ వైద్యులు జక్కుల రాజేంద్ర ప్రసాద్, సిస్టర్ రమ, ప్రకాష్, శ్రీనివాస్, ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, ఉపాధ్యాయులు తాటిపెల్లి వేణు గోపాల్, కమారుద్దీన్, కూరగాయల సురేష్, శైలజ పాల్గొన్నారు.

# మాసుల ప్రవీణ్ కు జిల్లా అధ్యక్షుడి ఘన సన్మానం



**మెట్ పల్లి, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి):**

మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డు నుంచి కౌన్సిలర్ గా గెలిచిన టీ యు డబ్ల్యూ జే ఐజేయు మెట్ పల్లి గౌరవాధ్యక్షులు మాసుల ప్రవీణ్ ను టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస్ రావు బుధవారం ఘనంగా సన్మానించారు. టీయూడబ్ల్యూజే ఐజేయు మెట్ పల్లి అధ్యక్షుడు డా: బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్ ,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్ ,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఏసమేని గణేష్, ఎండి అభిద్, శశి కుమారు, అమ్ముల ప్రవీణ్ పాల్గొన్నారు.

# వివాహా వేడుకల్లో పాల్గొనీ నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ ఎస్ నాయకులు




**ముత్తరం , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

మండలంలో పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మండల బి.ఆర్ఎస్ నాయకులు. బుధవారం రోజు వెంకటలక్ష్మి గార్డెన్లో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కట్కూరి రమ రాజిరెడ్డి కూతురు నవ్య– మనోజ్ రెడ్డి, ముత్తారంలో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న –సుమంత్ రెడ్డి–వామిక రెడ్డి, కేశనపల్లి గ్రామానికి చెందిన రామగళ్ళ మధుకర్– వినీత, జిల్లాల్ల పల్లి గ్రామానికి చెందిన మధునయ్య కూతురు అపర్ణ– రాకేష్ వివాహా వేడుకల్లో పాల్గొని నూతన వధూవరుల ను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మండల బి.ఆర్ఎస్ అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, సర్పంచ్ సుధాటి రవీందర్రావు, మాజీ సర్పంచ్ నూనె కుమార్, తాత బాలు, ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్, షేర్ స్వామి ముస్కే సదానందం, బిక్కినేని సుధాకర్ రావు, బొమ్మిడి మల్లేష్, వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# బాధ్యతల భారంతో ఎడారి బాట విషాదంగా ముగిసిన యువజీవితం

**కొడిమ్యాల, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**



కుటుంబ బాధ్యతలు,ఆర్థిక భారం తో గల్ఫ్ బాట పట్టిన ఓ యువకుడు నెల రోజుల క్రితం గుండెపోటుతో మరణించగా బుధవారం స్వగ్రామానికి చేరింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన కుక్కల మధు(25) కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చాలని, పెరిగిన అప్పులు తీర్చాలనే ఇరాక్‌కు వలస వెళ్లాడు. మూడు సంవత్సరాలు ఇరాక్ లో ఉద్యోగం చేసి సెలవులపై స్వగ్రామానికి వచ్చి తన సోదరికి వివాహం జరిపించి నాలుగు నెలల క్రితం ఇరాక్ దేశానికి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఇంతలోనే విధి వక్రీకరించి నెల రోజుల క్రితం గుండెపోటుతో మధు మృతిచెందడం జరిగింది.. నెల రోజుల అనంతరం మధు మృతదేహం స్వదేశానికి చేరుకోగా కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ కష్ట సమయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మానవీయ కోణంలో ముందుకు వచ్చారు. ఎయిర్‌పోర్ట్ నుంచి ఇంటి వరకు ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి కుటుంబానికి తోడుగా నిలిచారు. ఈ సందర్భంగా మధు కుటుంబానికి భరోసా ఇవ్వాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

# రోడ్డు పైన గల గుంతను పూడిపించిన

## గొల్లపల్లి ఎస్సై ఎం కృష్ణసాగర్ రెడ్డి

**గొల్లపెల్లి , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామంలో రోడ్డుపైన గల గుంతలను ఆర్ అండ్ బి వారి సహకారంతో స్థానిక ఎస్ఐ ఎం కృష్ణ సాగర్ రెడ్డి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చొరవతో పూడిపించినారు వచ్చి పోయే వాహనాదరులు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో శ్రీరాములపల్లి గ్రామ పెద్దలు పోలీస్ సిబ్బంది మరియు ఆర్ అండ్ బి సిబ్బంది పాల్గొన్నారు.



# ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

## తెలంగాణ జాగృతి డిమాండ్

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ జాగృతి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో దర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ముఖ్యంగా మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, కళ్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం, చదువుకునే అమ్మాయిలకు స్కూటీలు, నాలుగు వేల రూపాయల పెన్షన్, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకొస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించి వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పినా, ఇప్పటివరకు మహిళలకు సంబంధించిన హామీల అమలులో పురోగతి కనిపించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం కనీసం ఈ బడ్జెట్‌లోనైనా మహిళల హామీల అమలుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఈ రాష్ట్రంలో రక్షణ లేదని, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయకపోతే ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం



తక్షణమే స్పందించి మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జాగృతి మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు వరాల శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, ఊలేందుల నరేష్, చంటి శ్రీనివాస్, మహిళ విభాగం నాయకురాలు సంగీత రెడ్డి, జంగ అపర్ణ, ఎండీ సల్మా, ఐలా ప్రసన్న, సంతోషిణి, ఉప్పరి సంగీత, బసవేణి రాజేందర్, శీలం శ్రీనివాస్, హరిష్ శేఖర్, గుండేటి తిరుపతి, గాలిపల్లి రత్నాకర్ చారి, బండ అశోక్, సంతోష్ యాదవ్, బణాల కుమారస్వామి, సబ్బని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## తొలిరోజు 97 శాతం హాజరు

## జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన

**పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి):**

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం అత్యంత ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన లాంగ్వేజ్ (తెలుగు, హిందీ, ఉర్దూ) పరీక్షలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరుపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షా గణాంకాల వివరాలను వెల్లడిస్తూ, జిల్లాలో మొత్తం 5,419 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 5,271 మంది హాజరయ్యారని అధికారి తెలిపారు. వివిధ కారణాల వల్ల 148 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీనితో తొలిరోజు జిల్లాలో 97 శాతం హాజరు నమోదైనట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు కల్పన వివరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని వసతులు కల్పించామని, ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.

# తల వెంట్రుకల లోడుతో పారిపోయిన డెకాయిటి గ్యాంగ్ అరెస్ట్



**తంగళ్ళపల్లి , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

జగిత్యాల జిల్లా రాజేంద్రనగర్ కాలనీకి చెందిన అబ్బనవేని చిన్న ఎల్లయ్య జనవరి 10, 2026న 8 క్వింటాళ్ల తల వెంట్రుకలను బొలెరో పికప్ వాహనంలో లోడ్ చేసి జగిత్యాల నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఉదయం 5:40 గంటల సమయంలో పద్మనగర్ పెట్రోల్ బంక్ సమీపంలో కొందరు వ్యక్తులు ఆర్టీవో అధికారులమని నమ్మించి వాహనాన్ని లోడుతో సహా తీసుకుని పరారయ్యారు. దొంగిలించిన ఆస్తి విలువ రూ.20 లక్షలు ఉంటుందని బాధితుడు ఫిర్యాదు చేశాడు. తంగళ్ళపల్లి ఎస్ఐ ఉపేంద్ర చారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నిందితులు ఖమ్మం జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. ప్రత్యేక బృందంతో వెళ్లి ఐదుగురిని అరెస్టు చేశారు. వారిలో బొజ్జ కృష్ణయ్య,శివ,అంగులూరి ఎస్ పాల్ బబ్లు,ఎండ్రాతి ఉపేందర్,తీల్ పితియా సన్నీ డాల్ సింగ్,రెవిని క్రాంతి ఉన్నారు. విచారణలో నేరం ఒప్పుకున్నారు. మరో ఇద్దరు కూడా పాల్గొన్నట్లు తెలిసింది. సిరిసిల్ల రూరల్ సిఐ కె. మొగిలి విచారణ అనంతరం నిందితులను సిరిసిల్ల కోర్టులో హాజరుపరచగా కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించి కరీంనగర్ జైలుకు తరలించింది. కేసును ఛేదించిన ఎస్ఐ ఉపేంద్ర చారి మరియు కానిస్టేబుళ్లు సంపత్,శ్రావణ్,శ్రీనివాస్‌ను అధికారులు అభినందించారు.

# తెలంగాణ క్రీడ పాఠశాలలో ప్రవేశాలు

## ఫిజికల్ డైరెక్టర్ అక్బరు

**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**




ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వివిధ గ్రామాల ప్రజలకు తెలియజేయునది తమ పిల్లలు మూడవ తరగతి చదువుతున్న విద్యార్థుల కొరకు క్రీడా పాఠశాలలో దరఖాస్తులను కోరడమైనది. దరఖాస్తులు ఫిబ్రవరి 26 నుంచి మార్చు నాలుగు సాయంత్రం 4 గంటలకు మార్చ్ 13 నుంచి 17 వరకు మండలాలు వారిగా ఎంపిక ఉంటుంది. ప్రస్తుతం మూడవ తరగతి చదువుతున్న విద్యార్థి విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది .ఒకటి సెప్టెంబర్ 2017 వరకు జన్మించిన విద్యార్థిని విద్యార్థులు అర్హులుగా ప్రకటిస్తారు .30 మీటర్ల పరుగు, స్టాండింగ్ జంప్, వర్టికల్ జంపు ,షటిల్ రాన్, 800 మీటర్ వన్, ఆధార్ కార్డువీకరణ పత్రము, కుల ధృవీకరణ పత్రం, మూడో తరగతి ప్రోగ్రెస్ కార్డ్ ,5పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తప్పక అవసరం ఉంటాయ.

# పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

## అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

వచ్చే నెల 14 నుండి పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఉపాధ్యాయులకు సూచించారు. చింత కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం అడిషనల్ కలెక్టర్ సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందున రోజు విధిగా పాఠశాలకు రావాలని, ఉపాధ్యాయులతో సందేహాలు నివృత్తి చేసుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. మోడల్ పరీక్ష జవాబు పత్రాలను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థితో మాట్లాడి వెనుకబడిన సబ్జెక్టుపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుంటూ ప్రత్యేక తరగతులకు హాజరై పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని సూచించారు. 100 శాతం మంది ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అడిషనల్ కలెక్టర్ వెంటా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి ఆనందం, ప్రధానోపాధ్యాయులు శోభారాణి పాల్గొన్నారు.

# ఇసుక రవాణాను నిలిపివేయండి

## సర్పంచ్ జంకె మధు, వార్డ్ సభ్యులుతో ఎంఆర్ఓకు వినతి

**వేములవాడ , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**



వేములవాడ రూరల్ మండలం, హన్మాజీపేట గ్రామంలో... జరుగుతున్న ఇసుక రవాణాను వెంటనే నిలిపివేయాలని గ్రామ సర్పంచ్ జంకె మధుతో పాటు పంచాయతీ పాలకవర్గ వార్డు సభ్యులు కోరారు. ఈ మేరకు వారు వేములవాడ మండల రెవెన్యూ అధికారి అబు బాకర్ కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలోని మూలవాగు నుండి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తుండటంతో, హన్మాజీపేట నుండి లింగంపల్లికి వెళ్లే హైలెవల్ బ్రిడ్జి పునాదులు దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన మంచినీటి బావుల సమీపంలో ఇసుకను తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, దీనివల్ల రాబోయే వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఇసుక రవాణా కారణంగా పైపులైన్లు దెబ్బతింటున్నాయని ఫిర్యాదులో వివరించారు. గ్రామస్తుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, వెంటనే ఇసుక తవ్వకాలను ఆపి, గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# దమ్మయపేటలో పెద్ద పులి కదలికలు

## భయాందోళనలో గ్రామ ప్రజలు

## అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



**కొడిమ్యాల, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

కొడిమ్యాల మండలంలో మరోసారి పులి సంచారం కలకలం రేపుతోంది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం దమ్మయపేట గ్రామంలో పెద్ద పులి ప్రత్యక్షమవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు స్థానికులు గమనించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. సమాచారం అందుకున్న వెంటనే అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచనలు జారీ చేశారు. పశువులను బయట వదిలేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. రాత్రి వేళల్లో అవసరం లేకుండా బయటకు వెళ్లరాదని, పులి కనిపించిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రజలు గుంపులుగా చర్చించుకుంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఆర్ఓ గులం మొయినుద్దీన్, డిప్యూటీ రేంజర్ ముసిరుద్దీన్ పాల్గొన్నారు.





# రైతులకు భారీ ఊరట..

### తగ్గనున్న విద్యుత్ భారం
### వ్యవసాయ ఖర్చులు తగ్గించే దిశగా ప్రభుత్వ చర్యలు
### గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి



**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

వ్యవసాయం రోజురోజుకు వ్యయభారంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు అత్యంత కీలకమైన విద్యుత్ అంశంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వ్యవసాయ రంగానికి ఊరటనిచ్చే పరిణామంగా మారుతున్నాయి. సాగు వ్యయాల్లో ఎరువులు, విత్తనాలు, కార్మిక ఖర్చులతో పాటు విద్యుత్ సంబంధిత సమస్యలు రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో విద్యుత్ భారం తగ్గించే చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పంపుసెట్లు విద్యుత్‌పై పూర్తిగా ఆధారపడుతున్నాయి. అయితే తక్కువ వోల్టేజ్, తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ఆలస్యం, మరమ్మతులలో నిర్లక్ష్యం వంటి సమస్యలు రైతుల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా నీటి పారుదల వ్యవస్థ విద్యుత్ సరఫరాపైనే ఆధారపడటంతో విద్యుత్ అంతరాయం నేరుగా పంటల దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించడం కీలక పరిణామంగా మారింది. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించడం, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వేగంగా మంజూరు చేయడం వంటి చర్యలు రైతులకు నేరుగా లాభం చేకూర్చనున్నాయి. విద్యుత్ సరఫరా స్థిరంగా ఉంటే మోటార్లు దెబ్బతినే ప్రమాదం తగ్గడంతో రైతుల అదనపు ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో విద్యుత్ సమస్యల కారణంగా బోర్లు ఉన్నా నీటిని వినియోగించుకోలేని పరిస్థితులు అనేక గ్రామాల్లో కనిపిస్తున్నాయి. సరైన విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోవడం, మోటార్లు కాలిపోవడం వంటి ఘటనలు రైతులను అప్పులపాలయ్యేలా చేస్తున్నాయి. ఈ పరిస్థితులకు చెక్ పెట్టే విధంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఆధునీకరించడం అత్యవసరంగా మారింది. వ్యవసాయ విద్యుత్ వ్యవస్థ మెరుగుపడితే రైతు ఉత్పత్తి వ్యయం తగ్గడమే కాకుండా పంటల ఉత్పాదకత పెరుగుతుంది. దీని ప్రభావం కేవలం రైతులకే కాకుండా గ్రామీణ మార్కెట్లు, వ్యవసాయ ఆధారిత ఉపాధి రంగాలపై కూడా సానుకూలంగా పడుతుంది. రైతు చేతిలో ఆదాయం పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రకటించిన చర్యలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలన్నది రైతుల ప్రధాన డిమాండ్. ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి, కనెక్షన్ మంజూరు, మరమ్మతుల పనులు వేగంగా జరిగితేనే రైతులకు నిజమైన ఉపశమనం లభిస్తుందని వారు పేర్కొంటున్నారు. మొత్తంగా చూస్తే వ్యవసాయ రంగంలో విద్యుత్ సమస్యల పరిష్కారం రైతు భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశంగా మారింది. విద్యుత్ భారం తగ్గించడం ద్వారా రైతును ఆదుకునే ఈ చర్యలు సమర్థంగా అమలైతే వ్యవసాయం మళ్లీ లాభదాయక రంగంగా మారే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## విలేకరిపై ఫోన్ బెదిరింపులు

### చట్టపరమైన చర్యలకు డిమాండ్



**మేడిపల్లి , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

విధి నిర్వహణలో ఉన్న విలేకరి అందే అశోక్‌కు ఫోన్ ద్వారా అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడిన ఘటన మేడిపల్లి మండలంలో కలకలం రేపింది.భీమారం మండలానికి చెందిన వార్త విలేకరి అశోక్ ప్రజాసమస్యలపై వార్తలు సేకరించి ప్రచురిస్తూ ఉండగా,మన్నెగూడెం గ్రామానికి చెందిన శంభోజి మహేందర్ (ప్రస్తుతం విదేశాలలో నివాసం) తనకు సంబంధించిన వార్త ప్రచురితం కాలేదనే ఆగ్రహంతో జనవరి15న ఫోన్ చేసి బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనను పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించిన మేడిపల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ సభ్యులు,జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఘటనపై ప్రెస్ క్లబ్ సభ్యులు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మాడ శ్రీధర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.విచారణ జరిపి నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బేటీ బచావోబేటీ పడావో" పథకంపై అవగాహన కార్యక్రమం

### కేంద్ర సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ

**ధర్మారం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర సాధికారత కోఆర్డినేటర్ దయ అరుణ "బేటీ బచావో బేటీ పడావో" పథకం పై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను రక్షించడం,వారికి నాణ్యమైన విద్య అందించడం ప్రతి కుటుంబం మరియు సమాజం బాధ్యత అని పేర్కొన్నారు.గర్భంలో బాలికల హత్యలను అరికట్టడం,బాల్య వివాహాలను నిరోధించడం, అమ్మాయిల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించడం అత్యంత అవసరమని తెలిపారు.అమ్మాయిలు చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని, మహిళా సాధికారత సాధ్యమవుతుందని అరుణ వివరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు తెలియజేయడంలో వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం అంశాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని దయ అరుణ కోరారు. సమాజంలో లింగ వివక్షను తొలగించి, మహిళా సాధికారత సాధించాలంటే ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ బ్లాండిన, ఫీజియోథెరపిస్ట్ రవళి, సంతోష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.




## సర్పంచ్ పత్తి అనితకృష్ణారెడ్డిని సన్మానించిన వీణవంక మండల నాయకులు



**వీణవంక, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

వీణవంక మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, హుజురాబాద్ మండలం వెంకట్రావుపల్లి గ్రామ సర్పంచ్ పత్తి అనితకృష్ణారెడ్డి నివాసానికి మర్యాదపూర్వకంగా వెళ్లి శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సేవా కార్యక్రమాల్లో వారు చూపిస్తున్న చొరవను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ సాహెబ్ హుస్సేన్ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో సమగ్ర అభివృద్ధి సాధించాలంటే ప్రజాప్రతినిధులు పారదర్శకతతో పనిచేయాలని పేర్కొన్నారు. సర్పంచ్ పత్తి అనితకృష్ణారెడ్డి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సదుపాయం, రహదారుల నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేస్తున్నారని తెలిపారు.సర్పంచ్ పత్తి అనితకృష్ణారెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజల సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని చెప్పారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి వెంకట్రావుపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. యువత, మహిళలు, రైతుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు ధర్మకర్త జున్నుతుల మధుకర్ రెడ్డి, కంకణాల జగదీశ్వర్ రెడ్డి, చింతిరెడ్డి కోమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం




**మేడిపల్లి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు .బుధవారం మేడిపల్లి మండల విలయతాబాద్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ నూతన వస్త్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, గతంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేడిపల్లి మాజీ సర్పంచ్ బొంగోని రాజగౌడ్ లబ్ధిదారులకు తన వంతుగా రూ.30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఉరుమడ్ల నర్సయ్య,మాజీ ఎంపీటీసీ దాసరి శంకర్, దామోదర్, లాజర్ పాల్గొన్నారు.

## ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ

**ధర్మారం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**



మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,సాధన జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థులు ఉదయం నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకుని హాజరయ్యారు.పరీక్షలు సజావుగా జరగేందుకు కళాశాల యాజమాన్యాలు అన్ని ఏర్పాట్లు చేశాయి. హాల్ టికెట్ల పరిశీలన,తగిన భద్రతా చర్యలు తీసుకున్నారు.ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 571 మంది హాజరు కావాల్సి ఉండగా,559 మంది హాజరై 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 372 మందికి 367 మంది విద్యార్థులు,సాధన జూనియర్ కళాశాలలో 199 మందికి 192 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం97.89 శాతం మంది విద్యార్థులు పరీక్షక హాజరయ్యారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు డిఓలు కుమారస్వామి,రామకృష్ణ, సిఎస్ లు అనంత రామకృష్ణ, గీతావాణి తెలిపారు.

## చిన్నారి మృతికి కారణమైన బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలి



**ఎండపల్లి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

శిశువు మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి,అని తెలంగాణ మాదిగ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు చుంచు మల్లేశం, ఒక ప్రకటనలో పేర్కొన్నారు,నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మేరా జాతరలో జరిగిన ఘటనలో రెండు నెలల శిశువు మృతి చెందిన ఘటనలో కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన టీ.ఎం.ఐ.వీ తెలంగాణ మాదిగ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు చుంచు మల్లేశం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుల వివక్ష కారణంగా ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తూ బాధ్యులపై తక్షణమే హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ,వెంటనే బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జిల్లాపరిషత్ఉన్నతపాఠశాలలో మోడీ గిఫ్ట్ సైకిళ్ల పంపిణీ!



**వేములవాడ, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**


వేములవాడ రూరల్ మండలం, నూకలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో... బుధవారం రోజున ఘనంగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని.. బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మోడీ గిఫ్ట్ పేరుతో సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. వేములవాడ ఏరియా ఆసుపత్రికి రూ. 2 కోట్లు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నరేష్, వివిధ గ్రామాల నాయకులు,బండ.మల్లేశం,కడారి. తిరుపతి,జంగం. నరేశ్, జంగం. వంశీ,ఉప్పుల. గౌతమ్,గోపు. ప్రవీణ్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి పదివేల పెళ్లి కానుక..

### సర్పంచ్ ఎలక్షన్లో ఇచ్చిన హామీ పదివేల బహుమానం అందించి నూతన వధూవరులను ఆశీర్వదించారు..

**ముత్తారం , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

మండలం లోని ఓడెడ్ గ్రామంలో పేదింటి ఆడ బిడ్డ పెళ్లి కి గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి పదివేలు పెళ్లి కానుక గా అందజేశారు. స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ప్రతి పేదింటి బిడ్డకు పెళ్లి కానుకగా పదివేల రూపాయలు పెళ్లి పందిట్లో అందజేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం బుధవారం రోజు గ్రామానికి చెందిన నాగుల మల్యాల రవీందర్ లక్ష్మి కూతురు హేమలత వివాహం జరగగా వివాహనికి హాజరై పదివేలు అందజేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్, నాయకులు ఏర్రవెల్లి పాపారావు, దాసరి రవి, షేరు స్వామి, ముస్కె సదానందం, బొమ్మిడి మల్లేష్, బిక్కినేని సుధాకర్ రావు,అమ్ము దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



## పీఏడి పై డయాబెటిస్ బాధితులకు అవగాహన అవసరం

డా.శ్రీకాంత్ రాజు

**కరీంనగర్ టౌన్ , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**




డయాబెటిస్ రోగుల్లో కాళ్లకు రక్తప్రసరణ తగ్గడం (పిఏడి) పై అవగాహన అత్యవసరమని సీనియర్ కన్సల్టెంట్ వాస్క్యులర్ సర్జన్ ఎండోవాస్కులర్ సర్జన్, క్లీనికల్ డైరెక్టర్ యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ యూనిట్) డా ఎస్ శ్రీకాంత్ రాజు అన్నారు. మంగళవారం కరీంనగర్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డయాబెటిస్ ఉన్న వారిలో పిరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ (పిఏడి) సమస్య వేగంగా పెరుగుతోందని, డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండి, చిన్న గాయాలు కూడా మానకుండా పుండ్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. నరాల సమస్య కారణంగా కొందరిలో నొప్పి తెలియకపోవచ్చని హెచ్చరించారు. నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి, కాళ్లు త్వరగా అలసిపోవడం, పాదాలు చల్లగా ఉండటం, మానని గాయాలు, వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో కాళ్ల రక్తపోటు పరీక్ష, డాప్లర్ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను ముందే గుర్తించి చికిత్స చేయవచ్చన్నారు. డయాబెటిస్ రోగులు రక్త చక్కెరను కట్టుదిట్టంగా నియంత్రించుకోవాలని, పొగతాగడం పూర్తిగా మానాలని, అవసరమైతే మందులు లేదా యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు పాదాలను పరిశీలించడం, గాయాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. ముందస్తు అవగాహన, సకాలంలో చికిత్సతో కాలు కోల్పోయే ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చని డా. శ్రీకాంత్ రాజు స్పష్టం చేశారు.

## ఉపాధి లేక యువకుడి ఆత్మహత్య



**కొడిమ్యాల, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

సరైన ఉపాధి లేక,ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం..దమ్మయ్యపేట గ్రామానికి చెందిన బోయిని సాయికుమార్ (22) ఆర్థిక ఇబ్బందులు,సరైన ఉపాధి లేదని కారణంతో జీవితంపై విరక్తితో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని,మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**మంథని, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :**



మంథని పట్టణంలో ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొత్తం 208 మంది విద్యార్థులకు గాను 202 మంది హాజరుకాగా, బాలుర జూనియర్ కళాశాలలో 158 మందికి గాను 154 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పరీక్షల నిర్వహణపై అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించారు. ఇదే క్రమంలో నేడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా, సాఫీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

## కౌన్సిలర్లకు ఘన సన్మానం



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 6, 7, 9 వార్డుల కౌన్సిలర్లు బాకం సాయి కిరణ్, ఉట్ల వరప్రదీప్, తొర్రికొండ ప్రభాకర్‌లకు యాదవ నగర్‌లో బుధవారం ఘన సన్మానం నిర్వహించారు. బస్తీ దవాఖాన వైద్యురాలు డాక్టర్ సింధుజ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సమత, అంగన్‌వాడీ టీచర్ అరుణల ఆధ్వర్యంలో శాలువాలు కప్పి సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాదవ నగర్ ప్రాంత ప్రజలు తమ వార్డులలో నెలకొన్న పలు సమస్యలను కౌన్సిలర్ల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి అంశాలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రజలు సూచించిన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల సహకారంతో మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం నుంచి లభించే నిధులను పారదర్శకంగా వినియోగించి ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు రమా, స్వప్నతో పాటు యాదవ నగర్ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కౌన్సిలర్లకు అభినందనలు తెలిపారు.

## అమరుల ఆశయ సాధనకు యువత ముందుకు రావాలి

**రామగుండం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**




రామగుండం టౌన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో మంగళవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కామ్రేడ్ కత్తెరమల్ల పోచన్న, ఆరుమమల్ల భూమన్నల 34వ వర్ధంతి సభ నిర్వహించారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు కె.ధర్మేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను సంఘటితం చేసి సమాజంలో సన్మార్గంలో నడిపించడంలో కామ్రేడ్ పోచన్న కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన ప్రజాదరణను సహించలేక అరాచక శక్తులు దారుణంగా హత్య చేశాయని పేర్కొన్నారు. అలాగే కామ్రేడ్ ఆరుమమల్ల భూమన్న ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడైన విషయాన్ని గుర్తుచేశారు. అమరుల ఆశయ సాధన కోసం ప్రతి ఏడాది వర్ధంతి సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో అమలవుతున్న ప్రజావ్యతి రేక విధానాలపై యువత ఐక్యంగా పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందని, బలమైన ప్రజా ఉద్యమాల ద్వారానే అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, పీవైఎల్ జిల్లా నాయకులు ఐ.కృష్ణ, ఈ.నరేష్, చిలుక శంకర్, మేరుగు చంద్రయ్య, ఐ.రాజేశం, కొల్లూరి మల్లేశం, కోడిపుంజుల జ్యోతి, బతుకుల రాజన్న, పైడిపల్లి రమేష్, బొంతు ఆనంద్, సమ్మెట తిరుపతి, దూలం సతీష్, ఈదునూరి బాబు, కోడిపుంజుల భూమేష్, తూళ్ల గట్టయ్య, ప్రసాద్, అవినాష్ తదితరులతో పాటు అరుణోదయ కళాకారులు కాసర్ల మల్లేష్, జనగామ భానేష్, అమరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాల కోసం టాస్క్ శిక్షణ

## పెద్దపల్లిలో రీజినల్ సెంటర్ ద్వారా ఉచిత ట్రైనింగ్: కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి ప్రతినిధి , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టాస్క్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ మరియు ప్లేస్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 2023, 2024, 2025, 2026 సంవత్సరాల్లో డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కార్యక్రమానికి అర్హులని పేర్కొన్నారు. మొత్తం 200 సీట్లు మాత్రమే అందుబాటులో ఉండగా ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఫిబ్రవరి 25 నుంచి 28 వరకు ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో నిర్వహించబడుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమం మార్చి 2 నుంచి మార్చి 22 వరకు మూడు వారాలపాటు కొనసాగుతుందని, అభ్యర్థులకు 100 శాతం హాజరు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, ఈమెయిల్ ఐడి, ఫైనల్ మెమోతో టాస్క్ రీజినల్ సెంటర్, బస్ డిపో ప్రాంగణం, పెద్దపల్లిలో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9059506807 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

# సీట్‌బెల్ట్‌తోనే భద్రత

## గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు



పెద్దపల్లి , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సజీవంగా చేరుకోండి" రెండో విడత కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు బుధవారం ప్రత్యేక సీట్‌బెల్ట్ తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఈ రమేష్‌తో పాటు పోలీసు సిబ్బంది గాంధీ చౌరస్తా, కార్ టాక్సీ అడ్డా ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సీట్‌బెల్ట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి మాట్లాడుతూ సీట్‌బెల్ట్ ధరించడం పోలీసుల కోసం కాదని, వాహనదారుల స్వీయ ప్రాణ రక్షణ కోసమేనని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా సీట్‌బెల్ట్ వినియోగం లేకపోవడం వల్లే ప్రాణనష్టం జరుగుతోందన్నారు. ప్రతి ఫోర్‌వీలర్ డ్రైవర్ తప్పనిసరిగా సీట్‌బెల్ట్ ధరించి ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. సురక్షిత ప్రయాణం ప్రజల భద్రతకే దోహదపడుతుందని, రోడ్డు భద్రత విషయంలో ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బాధ్యతలు స్వీకరించిన డా. జి. శ్రావణ్ కుమార్




పెద్దపల్లి ప్రతినిధి , ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):

ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా డాక్టర్ జి. శ్రావణ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించినట్లు తెలిసింది. జిల్లా అభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేస్తామని ఈ సందర్భంగా డా. శ్రావణ్ కుమార్ తెలిపారు.

# వివాహ వేడుకల్లో పుట్ట మధూకర్

రామగిరి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. రామగిరి మండలం నాగేపల్లిలోని శ్రీలక్ష్మి గార్డెన్‌లో మచ్చుపేట గ్రామానికి చెందిన లగిశెట్టి రామచంద్రం కుమార్తె అఖిల – అనిల్ వివాహ వేడుకలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. సెంటనరీ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కల్వచర్ల మాజీ ఎంపీటీసీ కొట్టే సందీప్ – రమ్య వివాహ వేడుకలో పుట్ట మధూకర్ తన సతీమణి శైలజతో కలిసి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులు ఆనందంగా, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.



# సీట్ బెల్ట్ పోలీసుల కోసం కాదు.. మీ ప్రాణ రక్షణ కోసం

## పెద్దపల్లిలో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):



రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించి సీట్ బెల్ట్ ధరించాలని పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 'అరైవ్ అలైవ్' రెండో విడత కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీట్ బెల్ట్ పోలీసుల కోసం కాకుండా వాహనదారుల ప్రాణ రక్షణ కోసమేనని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్లే ప్రాణ నష్టం సంభవిస్తున్నదని పేర్కొన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇటువంటి ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# దాడులపై చర్యలు తీసుకోవాలి

## డీజీపీకి బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫిర్యాదు

పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):



రాష్ట్రంలో హిందువులు, దేవాలయాలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బీజేపీ ప్రజాప్రతినిధులు రాష్ట్ర డీజీపీని కోరారు. బుధవారం హైదరాబాద్ నాంపల్లిలోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యంగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కార్యాలయంపై జరిగిన దాడితో పాటు బాన్సువాడలో హిందూ యువకులపై దాడులు, రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలపై జరుగుతున్న ఘటనలను డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు పన్నాగపూర్వకంగా బీజేపీ నాయకులు, హిందువులపై దాడులకు పాల్పడుతున్నాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతిపత్రంపై స్పందించిన డీజీపీ శివధర్ రెడ్డి ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దాడులను సహించబోమని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య హెచ్చరించారు.

# నూతన గ్రామపంచాయతీకి భూమి పూజ

## త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం సర్పంచ్ రేవతి



ధర్మారం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):

మండలంలోని చామనపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో గ్రామ సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రేవతి మాట్లాడుతూ నూతన పంచాయితీ కార్యాలయం నిర్మాణం ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఇది మరో ముందడుగు అవుతుందని పేర్కొన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఉప సర్పంచ్ తిగుళ్ల కవిత సతీష్ రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ రాజశేఖర్, వార్డు సభ్యులు బుసరాజుల శ్రీనివాస్, రాపెల్లి శ్రీకాంత్, బేధగం హారిక అంజి, నిట్టు లక్ష్మి రాయలింగు, తిగుళ్ల రవళి కిరణ్ రెడ్డి, దాసరి సాగర్, మాజీ సర్పంచ్ దాసరి తిరుపతి, పురోహితులు చెన్నమల్ల సత్యనారాయణ, మహిళా సంఘాల సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ సుందరగిరి చందు, గౌడ గోవింద్, ప్రశాంత్ రెడ్డి, కొమ్మ లచ్చయ్య, వేల్పుల మల్లయ్య, ఆవుల చందు, దారవేణి తిరుపతి, మారం అశోక్, ఆవుల సాయి, రాజయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామగుండం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):

నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఉచిత శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ రామగుండం ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సీఎన్‌సీ ఆపరేటర్ (టర్నింగ్), ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ టెక్నీషియన్, స్క్రీన్ ప్రింటింగ్ ఆపరేటర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ (డిజిటల్) వంటి ట్రేడ్స్‌లో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత ధృవపత్రాలు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ ప్రతులు, రెండు తాజా ఫోటోలతో ప్రభుత్వ ఐటీఐ రామగుండం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పిఎంకెవివైపై శిక్షణకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మార్చి 3, 2026 వరకు కొనసాగుతుందని, శిక్షణ తరగతులు మార్చి 4, 2026 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. శిక్షణ కాలంలో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ అధికారులు కోరారు.

# కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గ్రీవెన్స్ సెల్ ప్రారంభం



**కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్, గ్రీవెన్స్ సెల్‌ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం ప్రారంభించారు. ప్రజల ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి పరిష్కరించడమే లక్ష్యంగా ఈ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.ట్రాఫిక్ ఉల్లంఘనలు,చలాన్ల వివరాలు,రోడ్డు భద్రతపై అవగాహన వంటి అన్ని ట్రాఫిక్ సంబంధిత సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.ప్రజలు ఈ గ్రీవెన్స్ సెల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, భీంరావు, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్ కరీముల్లాఖాన్ పాల్గొన్నారు.

# మెగా రంగ్ హోలీ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**జమ్మికుంట, ఫిబ్రవరి25( ప్రజాజ్యోతి ):**

జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం లో బ్రదర్స్ టీమ్ ఆధ్వర్యంలో మార్చి 3న మెగా రంగ్ హోలీ ఉత్సవాల పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ హాజరై ఆవిష్కరించారు. రంగుల హరివిల్లుగా, సాంస్కృతిక ఉత్సాహంతో వేడుకలను నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాల్గొనేవారికి ఉచిత రంగులు, సంగీతం, స్ప్రింక్లింగ్ వాటర్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. యువత ఐక్యతతో, సురక్షితంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. వేడుకల సందర్భంగా మద్యం, గుడ్లు, ధూమపానం వంటి హానికర పదార్థాలు నిషేధించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రదర్స్ టీం ఆర్గనైజర్స్ పాతకల ప్రవీణ్, సింగిరెడ్డి రంజిత్ రెడ్డి, గట్టు సాయిరామ్, సామల వెంకట్ రెడ్డి, కొత్త గణపతి రెడ్డి, పనికరి మహేష్, మహేష్ ప్రణయ్, శివనాగరాజు, సందీప్, అఖిరానందన్ పాల్గొన్నారు.

# ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం



**రామగిరి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి) :**

పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని బేగంపేట్ గ్రామంలో మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించే దిశగా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ మంథని చంటి బుధవారం ప్రారంభించారు. మహిళలు ఇంటి వద్దే ఉపాధి అవకాశాలను పొందుతూ ఆర్థికంగా బలపడాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న ర్యాంప్ ప్రాజెక్టు కింద మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో అలీఫ్ మహిళా శక్తి సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కుట్టు మిషన్ల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చని, అందుకు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సందేల రేణుక కుమార్, వార్డు సభ్యులు చొప్పరి సంజీవ్, గోగుల సౌందర్య, కొత్తూరు వాణి, వివోలు రేణుక, శ్యామల, సీసీ శంకర్ పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## సేవా కార్యక్రమాలతో అభిమానుల సందడి

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి):**

పెద్దపల్లి పట్టణంలో మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఉదయం టిఫిన్ పంపిణీ చేయడంతో పాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం పేదలకు అన్నదానం కార్యక్రమం చేపట్టి సామాజిక బాధ్యతను





చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాసరి మనోహర్ రెడ్డి ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడని పేర్కొన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, కౌన్సిలర్ వెన్నం రవీందర్ సుజాత, జిల్లా బీఆర్ఎస్వీ అధ్యక్షుడు కొయ్యడ సతీష్ గౌడ్, మాజీ ఎంపీపీలు సంపత్ యాదవ్, స్రవంతి మోహన్‌రావు, మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, జూపల్లి సందీప్‌రావు, బోయిని రాజమల్లు, పారుపల్లి గుణపతి, సర్పంచులు ఓజా సంపత్, బోయిన్ శ్రీనివాస్, భూమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# సమయపాలన లోపం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయ్



**ముస్తాబాద్, ఫిబ్రవరి 25 ( ప్రజా జ్యోతి ):**

గ్రామాల్లో అభివృద్ధి పనుల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఇంజినీరింగ్ అధికారి సమయపాలన పాటించకపోవడం స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. "జుమ్మా దుమ్మా" అంటూ పత్రికల్లో వరుస కథనాలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారి తన విధుల్లో ఎలాంటి మార్పు తీసుకురాలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించినప్పుడు "ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్‌లో ఉన్నాం" అనే సమాధానం ఇస్తున్నట్లు సమాచారం. అయితే మరుసటి రోజూ అదే పరిస్థితి కొనసాగడంతో అధికారుల వివరణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయానికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తరచూ గైర్హాజరు కావడం వల్ల ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల అనుమతులు, బిల్లుల క్లియరెన్స్, సాంకేతిక సమస్యల పరిష్కారం వంటి అంశాలు ఆలస్యమవడంతో పనులు నిలిచిపోతున్నాయని వారు వాపోతున్నారు. కార్యాలయానికి నిర్దిష్ట సమయానికి హాజరు కాకపోవడం వల్ల సమస్యలు పేరుకుపోతున్నాయని పేర్కొంటూ, సంబంధిత అధికారిపై ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పసికందు మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి




**గంభీరావుపేట ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి).:**

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెరలో కులవివక్షతో మహిళపై దాడి చేసి పసికందు మరణానికి సంభందించిన ఘటన నిందితులను తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని బుధవారం రోజున గంభీరావుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి రజక సంఘం మరియు బీసీ, ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తెలంగాణ సూపర్ వరకు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రజక మండల సంఘం నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ఎస్సీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా

**కరీంనగర్ టౌన్,ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి):**




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పసులు శ్రవణ్ నాయకత్వంలో జరిగిన ఈ నిరసనలో వివిధ కార్మిక వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మిక చట్టాల అమలులో నిర్లక్ష్యం, కనీస వేతనాల పెంపు లేకపోవడం, సామాజిక భద్రతా హక్కుల పరిరక్షణలో లోపాలు వంటి అంశాలపై ఈ ధర్నా చేపట్టినట్లు జిల్లా కార్యదర్శి తౌర్తి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు, రైస్ మిల్ కార్మికులు, స్ట్రీట్ వెండర్లు, బి ఎం ఎస్ కార్యకర్తలు, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రేణికుంట శంకర్, నక్క అరుణ్, ఆకుల తిరుపతి, మధుకర్, రాజేశం, సుమతి, స్వప్న, అనసూర్య, లక్ష్మీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

# రజక సామాజిక వర్గీయులపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

**వేములవాడ, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):**

వేములవాడ పట్టణంలో బుధ వారంరోజున,ఉత్తర తెలంగాణ జిల్లాలఅధ్యక్షులు,పొలాస.నరేందర్,అధ్యక్షతన,బుస్సాపూర్.శంకర్,రాష్ట్రప్రధానకార్యదర్శి,బీ.సీసాధికారిత సంఘం,వేములవాడ బీసీసాధికారిత సంఘకార్యాలయంలోఈరోజుఉదయంనాగర్,కర్నూల్,జిల్లా,కుమ్మెరగ్రామమల్లన్న జాతరలోసర్పంచ్ ,తూకా.రాంరెడ్డివర్గయులుసామాజికవర్గీయులైన రజకులపై జరిపిన దాడికి నల్లబ్యాడ్జీలతోనిరసనతెలిపి,దాడిలో 2నెలలపాపమృతిచెందడం పట్ల సమావేశం పాప మృతికి సంతాపాన్ని ప్రకటించి,రజక వర్గీయులు గణేష్,చంద్రకళ పై క్రూరంగా దాడి జరిపి,పాప మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని,దాడిలో నష్ట పోయిన రజక కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా బీసీ సాధికారిత సంఘం నేతలు తూపుకారి సత్తయ్య, ఇల్లందుల



వెంకటేష్,లింగం పెల్లి మల్లారం దేవయ్య,మాజీ కౌన్సిలర్స్ మారం కుమార్,సిరిగిరి.రామచంద్రం,కొం డ.కనుకయ్య,ఉయ్యాల.బూమయ్య, కడార్ల రాములు,పిన్నింటి హన్మాండ్లు, బిళ్ళ.కృష్ణ,కనపర్తి. సుధాకర్,బుర్ర. దర్శగౌడ్,చేను.హేళపతి,చింతలకోటి.రామస్వామిగౌడ్,కోరుదాల.తిరుపతి,దండ్ల. జాంపయ్య, ఎట్టెం.సాయికృష్ణ,మ్యాన రాజేష్,తూమ్ రాజు పాల్గొన్నారు.